3567

# చిన్ననాడు

**1921** ప్రాంతం.

విశాఖజిల్లా మాడుగుల జన్మస్థలం. అప్పటికి నా వయస్సు సుమారు 11 జగన్నాథ భూపతిదేవ వర్మగారి చావడికి ముందుగా ఒకరాతి తిన్నె. దానిమీద ఒక వెదురుగడ. చివర రాట్నంతో మూడు రంగుల జెండా, నన్నే చూడమన్నట్టు ఎగురుతోంది.

తిన్నెకు ఎదురుగా రెండు త్రోవలు కలిసిన ఇసకనేల. విశాలంగా కొన్ని వందలమంది కూర్చోవచ్చు.

సాయంకాలం 5 గంటలకు బడి విడిచారు.

పిల్లలమంతా పలకలు పుస్తకాలు, చంకలో పెట్టుకుని గోల చేసు కుంటూ వస్తున్నాము.

భూపతిగారి చావడిముందు పెద్ద సభ—

జనం విరగబడి వింటున్నారు—

తిన్నెమీద ఊరిపెద్దలు ఖద్దరు టోపీలతో—

'ఎఱ్ఱరంగు ఆంధ్రపత్రిక' పేజీలు తిరగేస్తూ ఏదో తీవ్రంగా చర్చి స్తున్నారు.

మాడుగుల కాంగ్రెసు నాయకుడు, యూనియన్ ప్రెసిడెంటు, భమిడిపాటి చిన యజ్ఞనారాయణ శర్మ. ఊరందరికీ ధర్మారావుగారు— చట్టున లేచి ఉపన్యసించడం మొదలు పెట్టారు.

పుష్టిఅయిన పచ్చని శరీరం చేయెత్తు మనిషి.

'అర్ధముండిత' శిరస్కుడు. ముతక ఖద్దరు లాల్చి, ధోవతి. పచ్చని ముఖం కందగడ్డలా ఎఱ్ఱబడింది. బలమైన రెండు చేతులు ఎగరేస్తూ మాట్లాడు తున్నారు. మాటల్లో నిప్పులు కురుస్తున్నాయి. ఆయ నెందుకంత కోపంగా మాట్లాడుతున్నారో పదకొండేళ్ళ పసివాడికి ఏం తెలుస్తుంది?

మాటల మధ్యలో— మహాత్మాగాంధీ — జలియన్‌వాలాబాగ్ దురం తాలు-స్వరాజ్యం అనే మాటలు దొర్లుతున్నాయి. కూర్చున్నవారు ఉలికులికి పడి వింటున్నారు.

ధర్మారావుగారు ఉపన్యసించి కూర్చున్నారు.

విదేశీవస్త్ర దహనం అని ఎవరో బిగ్గరగా అరిచారు—

ఒక్కొక్కరు లేచి పై బట్ట మాత్రం చుట్టబెట్టుకుని షర్టులు, కోట్లు, పంట్లాములు దూసిపోశారు.

అది ఒక వస్త్ర పర్వతం—గుడ్డల కొండ.

అప్పుడు నాకు—ఒక పసివానికి—ఏ మర్థమయిందో చెప్పలేను. సాటి మానవుల తీవ్రస్పందనాలు తెలియకుండానే— ఎంత పసివాళ్ళకైనా ప్రతిస్పందనం ఇస్తాయనుకుంటాను.

ఒళ్ళు గరిపొడిచింది.

రక్తం తలవరకు ఎగపొడిచింది.

తోటిపిల్లలు ఏం చేశారో తెలియదు.

నేను పలకా పుస్తకాలు పక్కకు విసిరి— లాగు ఒక్కటీ ఉంచుకొని ఉన్న ఒక్క చొక్కా చర్రున ఆకాశానికి లేచిన ఆ మంటల్లో వేసేశాను.

ఆ జ్వాలలు రెండు గంటల వరకూ చల్లారలేదు. చొక్కాలేని ఒంటితో ఇంటికి వెళ్ళి నాన్నచేత తిట్లుతిని, అన్నం తినకుండా పడుకున్నాను.

ఏమిటి నువ్వు చేసింది?

ఎందుకు చేశావు ?

ఫలితం ఏమిటి ?

ఏమో ఎవడికి తెలుసు? నా గుండె కొట్టుకుంది—

నేను చేశాను అంతే!

అదే వేదికమీద విశాఖజిల్లా జాతీయ నాయకులు వసంతరావు బుచ్చి సుందరరావు, మారేపల్లి రామచంద్రశాస్త్రి [కవిగారు], దిగుమర్తి సీతా రామస్వామి వగైరా ప్రముఖులు ముక్తకంఠంగా ఉపన్యసించారు. ప్రయాగ ఆయన ఒక పొట్టివ్యక్తి. కణకణమండేలా ప్రసగించేవాడు. పాటలు పాడే వాడు. ఉపన్యాసాలు అర్థం కాకపోయినా "దండాలు దండాలు భారతమాత! అవి అందుకోని దీవించు భారతమాత! ఈరాజ్యమంత సాలెపట్టు! భారత మాత! మేమందులోని ఈగలము భారతమాత" అంటే ఆపాట ఊపులో ఏదో అర్థమయిపోయినట్టే ఉండేది. ఆపాట నేర్చుకున్నాం. పాడాం. ఆపాట రాసిన ఒడ్డాది సీతారామాంజనేయులుగారిని సంస్కృత కాలేజీలో చాలా రోజుల తర్వాత చూశాను. చిన్ననాటి ఆయనమీద ఆరాధన అలాగే మిగిలి పోయింది.

ఎప్పుడైనా మాడుగుల్లో భూపతిగారి చావడి ముందుకు వెడితే అరవై యేళ్ళయినా-ఆ ఉపన్యాసాలు, పాటలు, అక్కడ గాలిలో తేలి విన బడుతున్నట్టే ఉంటుంది.

# 2

1930 మార్చి- ఉప్పు సత్యాగ్రహం అన్నారు. కాలేజీలో చదువు కుంటూ సెలవులకు ఇంటికి వచ్చాను. మా పొరుగు మిత్రులు బాసూబలేం ద్రుని సీతారామరాజుగారు "విశాఖపట్నం వెడుతున్నా, వస్తారా?"అన్నారు. బయలుదేరాం. స్టేషన్‌లో రైలుదిగి టౌనులోకి వెళ్ళాం.

రాజవీధి నిర్జనంగా ఉంది.

దాహమైతే సోడా పుట్టలేదు.

గొంతు ఆర్చుక పోతోంది!

ఆరోజు పట్టణమంతా హర్తాళ్!

ఉట్టుడికినట్టు ఉడుకుతోంది, పట్టణం!

"రఘుపతి రాఘవ రాజారామ్
పతిత పావన సీతారామ్"

ఊరినడుమ టౌను హాలు ప్రాంతం నుంచి ఒక ఊరేగింపు రెండు ఫర్లాంగుల పొడవున నదీ ప్రవాహంలా ఉరకలు వేస్తూ వస్తోంది. ముగ్గురు నాయకులు ముందువరసలో నిలుచుని ఉన్నారు. మధ్యనున్న ఒక రాజుగారు ఆజానుబాహువు. తలపై గాంధీటోపీ. మెడలో పూలదండలతో కలిసిన ఖద్దరు నూలు దండలు. ముగ్గురు మనుష్యుల వెడల్పున ఊరేగింపు సాగి వస్తున్నది. ఒళ్ళు ఝల్లుమంది. ఆపాదమస్తకం రక్తం వేడెక్కింది.

ఎందుకు?

ఆరోజు ఉప్పు సత్యాగ్రహంలో ధర్మారావు, కవిగారు, సీతారామస్వామి వగైరా ఆరుగురు నాయకులు అరెస్టయి జైలుకు వెళ్ళారు.

ఆ బాధ, ఆ అవమానం, ఆ ప్రతీకారవాంఛ, ప్రతి పౌరహృదయం లోను రగులుతోంది.

ఆ ఊరేగింపు గమ్యం ఏమిటి?

సన్మానసభ కాదు.

ఏదో ఉత్సవ సందర్శనం కోసం కాదు.

సరాసరి సముద్రపొడ్డుకు వెళ్ళి ప్రభుత్వ శాసనం ధిక్కరించి తమ జన్మహక్కుగా సముద్రపు నీరు తీసి ఉప్పు వండడానికి వర్షంలా మీద కురిసిన లాఠీ దెబ్బలు తినడానికి- సార్జెంట్ల ముళ్ళబూట్ల తన్నులతో శరీరం నుంచి రక్తం చిందించడానికి—దాని ఫలితం భావితరాలకు పంచిపెట్టడానికి - ఊరేగింపులో కలసిపోయాం.

ఎవ్వరూ పిలవనక్కరలేదు. ఆ లాఠీదెబ్బలు, బూట్ల తన్నులు తినే వారి రక్తం, మా ఒంట్లో రక్తమూ ఒక్కటే; అది ఉడికితే ఇది చల్లగా తనకు పట్టనట్టు ఎట్లా ఉండగలదు?

సముద్ర పొడ్డున ఇసకవేస్తే రాలనంత జనం! దిగుమర్తి జానకమ్మ గారు వగైరా ముగ్గురు, నల్గురు మహిళలు రాళ్ళు పేర్చి, సముద్రపు నీళ్ళు తెచ్చి పొయ్యిలమీద పెట్టి మంట చేస్తున్నారు. ఇసక తిన్నెల్లో ఒకటే కోలాహలం.

పోలీసు వాన్ వచ్చింది.

వన్, టూ, త్రీ- లాఠీ మారో -

కుండలు పగిలాయి. గాజులు తునాతునకలయ్యాయి. తలలు చిట్లి నెత్తురు కారుతున్నాయి, ప్రజలు భయభ్రాంతులై పరుగెడుతున్నారు.

దెబ్బలు తిన్నవారు, రక్తం కారేవారు, తల చెదిరి, గాజులు చిట్లి,

నొసటి కుంకుమ కరిగిన స్త్రీలు, తాము ఒక పవిత్ర విధి నెరవేర్చినట్టు, పెసలతో సమంగా దెబ్బలు తిన్న తృప్తితో—తమ శిబిరానికి బయలు దేరారు ప్రశాంతంగా.

# 3

ఆ వేసవిలో నా సహవిద్యార్థి అబ్బరాజు జానకిరామయ్య మద్య పాన నిషేధ ప్రచారంలో తాటి మొవ్వులు నరికి జైలుకి (బోర్‌స్టల్ స్కూలు) వెళ్ళాడు.

విజయనగరంలో మళ్ళా చదువు. మాలవ్యా, నెహ్రూలను అరెస్టు చేసినందుకు నిరసనగా, కాలేజీకి ఆ రోజు సమ్మెచేసి ఖద్దరు తానులు, ధోవతులు, బుజంమీద వేసుకుని ఖద్దరు హాకింగ్ జరిపాం.

ఇంగ్లీషు, సంస్కృత కాలేజీ విద్యార్థులంతా కలసి పెద్ద ఊరేగింపు లేవదీశాం. పోలీసులు ఖద్దరు టోపీ వున్న అందరి పేర్లూ రాసుకున్నారు.

ఆ సంవత్సరం సత్యాగ్రహ జాతీయ కార్యక్రమాల్లో పాల్గొన్నం దుకు—వేరే కారణం చూపి, నన్ను మూడు సంవత్సరములు డిబైన్ చేశారు. టి. సి. ఇచ్చి పంపివేశారు. నావంటి వారివల్ల కళాశాల క్రమ శిక్షణ చెడిపోతుందని భావించారు అధికారులు.

నాకు మూడవ సంవత్సర పరీక్షలో వచ్చిన మార్కులు చూచి జాతీయ భావాలుకల కొవ్వూరు ఆంధ్ర గీర్వాణ విద్యాపీఠంవారు ఉభయ భాషాప్రవీణ నాలుగో సంవత్సరంలో చేర్చుకున్నారు.

1932 మార్చిలో పరీక్షలు రాసి పాసయ్యాను.